# ఏది కారణం?

"మాది ఇంటర్‌కాస్ట్ మేరేజండీ. షి ఈజె దలిత్ అండ్ ఐయామె నాయుడు" అని తన భర్త రంగస్వామినాయుడు తన ఆఫీసర్ గారికి తమ పెళ్ళయిన కొత్తల్లో పరిచయం చేసినప్పుడు సువర్ణ అంతగా పట్టించుకోలేదు. పైగా గర్వపడింది కూడా, వర్ణాంతర వివాహం చేసుకున్నందుకు – అదీ దళితుల పిల్లను పెళ్ళి చేసుకున్నందుకు సిగ్గుపడకుండా, బాహాటంగా, సగర్వంగా చెప్పినందుకు.

ఆమె స్కూలు టీచరు. ఎల్‌కెజి, యుకెజి క్లాసులు తీసుకునేది. తన అన్న కూతుర్ని స్కూల్లో దించి అతను ఆఫీసుకు వెళ్ళేవాడు. పాప ప్రోగ్రెసెలా ఉందో తెలుసుకునేందుకు అతను సువర్ణ దగ్గరకు వచ్చేవాడు. అలా పరిచయమైంది వాళ్ళిద్దరికీ. ఓసారి, "ఎలా వేగుతున్నారండీ, ఈ చిన్న పిల్లలతో? మా సుషమకు సెలవొస్తే ఇల్లు పీకి పందిరేస్తుంది. దీని ఒక్కదానితోనే మేం ఇంట్లో వేగలేకపోతున్నాం" అనడిగాడు రంగస్వామి.

సువర్ణ నవ్వింది. "మేం టీచర్లం కదా! మా దగ్గరంత గోలచేయదు. పైగా మేం ఇంట్లో వాళ్ళలా రికామీగా వదిలెయ్యం. వాళ్ళ దృష్టిని మళ్ళిస్తాం మావైపు, చదువువైపు" అంది.

రంగస్వామి ఆమె మాటల్ని వినలేదు. ఆమె నవ్వుతుంటే ముఖకవళికలు పూలరేకుల్లా విచ్చుకుంటే ఆ అందంలో స్నాతుడయాడు.

ఆ పరిచయం ప్రేమకూ, ఆ తరువాత పెళ్ళికీ దారి తీసింది.

"నువ్వు దళితుల అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే మీ వాళ్ళు అభ్యంతరపెట్టరా?" అనడిగింది సువర్ణ.

"ఎవరు అభ్యంతర పెట్టినా నేను లెక్కచేయను. మనం ఏ కులంలో పుట్టామో మనకు తెల్సా? బర్త్ ఈజేన్ యాక్సిడెంట్. కులాలు పోతేనే సమసమాజం వస్తుంది" అన్నాడు.

"మా అమ్మాయిని పెళ్ళి చేసుకోబోయే ముందు మరోసారి ఆలోచించుకో బాబూ! తొందరపడి నిర్ణయాలు తీసుకుని ఆ తరువాత పశ్చాత్తాపపడితే ప్రయోజనం ఉండదు" అన్నాడు సువర్ణ తండ్రి కృష్ణయ్య. ఆయన ప్రభుత్వాసుపత్రిలో మినిస్టీరియల్ స్టాఫ్ సూపరింటెండెంట్‌గా పని చేసేవాడు. మూరెడుపోయి బారెడు వెనక్కు వచ్చే తత్త్వంకాదు ఆయనది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విద్యావంతులయిన దళితుల మొదటి తరానికి చెందినవాడు ఆయన. దళితుడు కూడా సామాజిక ఉపరితలంలోకి రావటం సహించలేని అగ్రవర్ణాల అహంకారాన్ని ఆయన చవిచూశాడు. అందుకాయన వాళ్ళపై కోపగించుకోలేదు. మత్సరాన్ని పెంచుకోలేదు. ఆచితూచి అడుగేయటం నేర్చుకున్నాడు.

"ఆలోచించుకోవాల్సింది ఏం లేదండీ. ఆదర్శంతో ముందుకడుగేయ చూసే యువతను మా నాన్న అమ్మలాగా మీరూ నిరుత్సాహపర్చటం బాగాలేదు" అన్నాడు రంగస్వామి ఆవేశంతో.

"ఆదర్శాలు కాదనటం లేదు. అవి జీవితాంతం ఉంటే మంచిదే. బతుకులో ఎదురుదెబ్బలు తగిలినప్పుడు ఓర్చుకోలేక పారిపోయే ప్రయత్నం చేస్తారేమోననే ఇంతగా చెప్పేది."

అలా సువర్ణ తల్లిదండ్రులు వివాహానికి సుముఖత వ్యక్తం చేసినా, రంగస్వామి తల్లిదండ్రులూ, అన్నా అభ్యంతరం చెప్పారు. అయితే, వాళ్ళ మాటలను అతను లెక్క చేయలేదు. రిజిస్టరు మారేజి చేసుకుని ఇంటికి వచ్చినప్పుడు, "నువ్వు నా ఇంట్లో చెడ బుట్టావు. నేను ఈ అస్పృశ్యుల పిల్లను నా కోడలుగా అంగీకరించను. మీరు వెళ్ళండీ. మళ్ళీ ఎప్పుడూ నా ఇంటి గడప తొక్కవద్దు" అని రాజయ్య నాయుడు కోపంగా, నిర్మోహ మాటంగా చెప్పినప్పుడు సువర్ణ ఆయన్ని అసహ్యించుకున్నది.

అతని తల్లి, "ఏం పని చేశావురా? కనిపెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల మాటలను నువ్వు పెడచెవిన పెడ్తావని ఎప్పుడూ అనుకోలేదు" అని రోదించినప్పుడు, అగ్రవర్ణపు దురహంకారం అలా కన్నీళ్ళుగా కరిగిపోతున్నప్పుడు ఆమె మనసుకో రకమైన తృప్తి లభించింది.

కానీ ఆ తర్వాత కానీ ఆమెకర్థం కాలేదు. వాళ్ళను తప్పు పట్టడంలో తాను పొరపాటు చేశానని ఆమె గ్రహించింది. వాళ్ళకు తన కులం హీనకులమన్న అభిప్రాయం ఉంది. అందుకే నిర్మోహమాటంగా అలా తన ఎదుటే ప్రవర్తించారు. మనసులో ఓ అభిప్రాయం ఉంచుకుని బయటికొకటి చెప్పలేదు. అలాంటి మనుషులను అర్థం చేసుకోవడం తేలిక. తనేదో గొప్ప పని చేశాననీ, తనను పెళ్ళిచేసుకుని ఉద్ధరించానన్న భావన భర్తలో ఉన్నదనీ సువర్ణ త్వరలోనే గ్రహించగలిగింది.

అతని తల్లిదండ్రులలా ఇంటినుంచి వెళ్ళగొట్టాక సువర్ణ ఇంటికి వచ్చారు వాళ్ళు. ఆమె తల్లిదండ్రులు నూతన దంపతులను హృదయపూర్వకంగా తమ ఇంటికి ఆహ్వా నించారు.

"మాకున్నది ఒక్కతే కూతురు. మీరూ మాతోటే ఉండొచ్చు" అన్నాడు కృష్ణయ్య.

"పర్మెనెంటుగా కుదరదులెండి. మాకు వేరే ఇల్లు అద్దెకు దొరికేదాకా మీ ఇంట్లోనే ఉంటాం" అన్నాడు రంగస్వామి.

"అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకున్నామని మేం భావించం. మీ దాంపత్య వ్యవహారాల్లోనూ మేం పట్టించుకోం. మీరు మా ఇంట్లో ఉన్నా వేరే ఇంట్లో ఉన్నట్టే భావించవచ్చు" అన్నాడు కృష్ణయ్య.

"అలా కాదులేండి. అగ్రవర్ణ వర్గాల నుంచి మీరెలాంటి అవమానాలకూ, అవహేళన లకూ తలవొగ్గాల్సి వచ్చిందో అలాంటివి సహించే ఓర్పు మాకు లేదు. ఇక్కడ ఉంటే అవి తప్పవు. వేరుగా ఉండటమే అందరికీ శ్రేయస్కరం."

అందుకు కృష్ణయ్య జవాబివ్వలేదు కానీ సువర్ణకు గుండెల్లో కెలికినట్టయింది.

"అంటే నీ అగ్రవర్ణపు దురహంకారం నీకింకాపోలేదు. మీ అమ్మావాళ్ళు ఆ మాటన్నారని కోపమెందుకు?" అంది ఆమె.

"నాకు దురహంకారం ఉంటే మన పెళ్ళయ్యేది కాదు. ఆదర్శాలున్నా ఏది ఆచరణాత్మకమో దాన్ని పాటించక తప్పదు."

ఇంకేదో సువర్ణ మాట్లాడబోతుంటే కృష్ణయ్య ఆమెను వారించాడు. "మాటకు మాట తెగులు. వాదనల వల్ల విషయం నిగ్గుదేలదు కానీ ఆవేశకావేషాలు మాత్రం వస్తాయి. మీరు వాదించుకోవద్దు. ఇద్దరూ కొంత ఎడ్జెస్టు అవటానికి ప్రయత్నించాలి" అన్నాడు.

నూతన దంపతుల మొదటి రాత్రినే ఆమెను దగ్గరకు తీసుకుంటూ, "ఇంటర్‌కాస్ట్ మారేజి చేసుకుంటే ప్రభుత్వం ఏవో రాయితీలిస్తుందని విన్నాను. ఎవడూ, మన్ని పట్టించుకున్న వాడేలేడు" అన్నాడు రంగస్వామి.

"మనమేదో రాయితీలొస్తాయని పెళ్ళి చేసుకోలేదు. మన కోసం - ఒకరికొకరి కోసం చేసుకున్నాం" అంది సువర్ణ.

"కాదంటల్లా. ఊరికే వస్తే అనుభవించటానికి చేదా?"

"ఊరికే వస్తుందని ఎగరేసుకు పోవచూడడం మంచిది కాదు. అవసరం లేకపోతే, ఎవరిచ్చినా, కాఫీనే కాదు - మంచినీళ్ళు కూడా తాగనని మా నాన్న అంటాడు."

"మీ నాన్న గొప్ప చెప్పుకుంటూనే ఈ రాత్రి గడిపేద్దామా?" అన్నాడతను ఆమెను ముద్దుపెట్టుకుంటూ.

"లేదు. నీ గొప్పలే చెప్పు వింటాను."

"మాటలొద్దు. చేతలే బావుంటాయి."

ఆమె స్కూలు నుంచి, అతను ఆఫీసు నుంచి వచ్చాక దంపతులు అద్దె ఇంటికోసం వెదుకులాట ప్రారంభించారు. కులం సంగతి ఇంటి వాళ్ళు ప్రస్తావించక ముందే అతను చెప్పేవాడు తను నాయుడనీ, ఆమె దళిత్ అనీ. అందువల్ల వాళ్ళకు చాలాచోట్ల ఇల్లు దొరక్కుండా పోయింది. అలా ఓ రెండు మూడు ఇళ్ళు చూశాక, విసుగొచ్చి, "మనం వెళ్ళిన ప్రతి ఇంటి యజమానికీ, అతనడగకపోయినా మన కులాల సంగతి చెప్పాలా?" అని అడిగింది సువర్ణ.

"ఏదయినా దాచుకోవడం అంటే నాకిష్టముండదు. ముందే చెప్తే, వాళ్ళకిష్టముంటే ఇల్లు అద్దెకిస్తారు. లేకుంటే లేదు. కానీ, ఇంట్లో చేరాక మన కులాల సంగతి తెల్సి ఇల్లు ఖాళీ చేయమంటే కష్టం కదా! అందుకే చెప్పాను" అన్నాడతను.

రంగస్వామి మాటల్లో హేతువు లేకపోలేదు. అలాగని అతని మాటలు పూర్తిగా హేతుబద్ధమనీ నమ్మబుద్ధికాలేదు సువర్ణకు. తన జాత్యహంకారం చూపిస్తున్నాడో, తన కులపు న్యూనతను వెళ్ళగక్కుతున్నాడో అర్థం కాలేదు ఆమెకు.

అలా వెతగ్గా వెతగ్గా ఓ క్రిస్టియన్ల ఇంట్లో ఓ పోర్షను అద్దెకు దొరికింది వాళ్ళకు. ఇంటి యజమాని పేరు క్రిస్టోఫర్. ఆయన ఇల్లు చూపించాక రంగస్వామి పాతపాటే

వినిపించాడు. "నా పేరు రంగస్వామినాయుడు. నా కులమేదో పేరులోనే ఉంది. నా భార్య - సువర్ణ. ఆమె దళిత్. మాది వర్ణాంతర వివాహం. మీకు ఎలాంటి అభ్యం తరమూ లేకపోతే మేం మీ ఇంట్లో అద్దెకు దిగుతాం" అని.

"మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. నిజానికి మేమూ కన్వర్టెడ్ క్రిస్టియన్సుమి. మేం క్రైస్తవ మతం పుచ్చుకోక ముందు మమ్మల్నీ హరిజనులనే పిల్చేవాళ్ళు. ఐ హేట్ దట్ వర్డ్. అదేదో మనల్ని వెలివేసినట్టు చూసేమాట. మేమసలు హిందువులం కాదు. నాలుగు వర్ణాల్లో మాకు స్థానం లేదు. పంచములని మమ్మల్ని వాళ్ళల్లో కలుపుకో చూశారు. గాంధీ కూడా హరిజనులని పేరెట్టి అదే పని చేయబోయాడు. నిజానికి మత రహితమైన వాళ్ళం మేం. కనుక ఏ మతంలో విశ్వాసముంటే ఆ మతంలో చేరొచ్చు మేం. కులాల భేదాలు లేని క్రైస్తవం, బౌద్ధంలలో దేంట్లో చేరినా మంచిదే" అన్నాడాయన పెద్ద ఉపన్యాసమిస్తూ.

"కులరహితంగా ఉండ ప్రయత్నిస్తాను నేను. అలాగే ఎవరైనా మతరహితంగాను ఉండవచ్చేమో" అన్నాడు రంగస్వామినాయుడు.

"మా విషయంలో మాత్రం అలాంటి స్థితి ప్రమాదకరం. ఈ అగ్రవర్ణాల వాళ్ళు మమ్మల్ని హిందువులను చేసేస్తారు కానీ పంచముల స్థాయికిమించి మాత్రం ఎదగ నివ్వరు."

"నాకు కులం లేదు కానీ ఒక విషయం మాత్రం చెప్పక తప్పదు. కులాల అంతరాలు సృజించిన బాపన వర్గానిదే తప్పంతా. అందుకు మిగతా అగ్రవర్ణాల వారిని తప్పు పట్టటం ఎంతవరకు సమంజసమంటారు?"

ఇప్పటిదాకా భర్త వాదన ధోరణి విన్న సువర్ణకు మంటపుట్టింది. నిజానికిప్పుడతనన్న మాటల్లో ఏంలేదు. అతని జాత్యహంకారం అప్రచ్ఛన్నంగా వెల్లడవటం పెళ్ళయినప్పటి నుంచి జరుగుతూనే ఉంది. తామిద్దరూ ఒకళ్ళంటే ఒకళ్ళు ఇష్టపడ్డారు. హాయిగా కాపురం చేసుకోటానికి కులాలు అడ్డురాలేదు. కులం లేదంటూనే కులపు అహంకారాన్ని వ్యక్తీకరించే మనిషి తన భర్త అని అర్థమయ్యాక ఆమె అతని ధోరణిని సహించలేకపోయింది.

అందుకే, "మీ బ్రాహ్మణేతర అగ్రకులాల పాపం కూడా బ్రాహ్మణ వర్గానికి అంటకట్టక - నిజానికి వాళ్ళంత పిరికివాళ్ళు మరెవరూలేరు. వాళ్ళేం రాజ్యాలు చేయలేదు. దేశాలు ఏలలేదు. రాజ్యాలు చేసిన వాళ్ళు మీరు. మీ వెస్టెడ్ ఇంటరెస్ట్‌లని కాపాడుకోటం కోసం వాళ్ళనీ, సమాజంలో వాళ్ళకున్న పలుకుబడినీ మీరూ వాడుకున్నారు. తిలాపాపం తలా పిడికెడని చేసిన పాపానికి అందరూ బాధ్యులే" అంది సువర్ణ.

"చూశారా, మా ఆవిడ "మీరు, మీరు" అంటూ నన్ను అగ్ర కులస్థులతో చేర్చి మాట్లాడుతూ ఉంటుంది. నాకు కులం లేదని మొత్తుకున్నా వినదు. కులాలు ఉన్నవాడి నయితే నేను తనని కట్టుకుంటానా మీరు చెప్పండి" అన్నాడు రంగస్వామి.

"నిజమే. మంచి ఆశయాలున్న యువకులు మీరు. మీలాంటి వాళ్ళు సమాజంలో మరి కొంతమంది ఉంటే అంబేద్కర్ కలలుకన్న కులరహిత సమాజం అవతరించటానికి

ఎంతో కాలం పట్టదు" అన్నాడు క్రిస్టోఫర్.

రంగస్వామి, సువర్ణ అద్దె పోర్షనులో దిగిన పది రోజులకు ఓ ఆదివారం నూతన దంపతులను డిన్నర్ పార్టీకి పిలిచారు ఇంటివారు. చికెన్, మటన్‌లతో వంటకాలు ఘుమఘుమలాడుతున్నాయి.

"సుగుణా క్రిస్టోఫర్‌గారూ! మీ వంట అద్భుతంగా ఉంది. మా ఆవిడ చేసే కూరగాయల ఇగుర్లూ, బాపన పప్పుతో తినలేక ఛస్తున్నానంటే నమ్మండి" అన్నాడు రంగస్వామి భోజనం చేస్తూ.

"ఏం సువర్ణా! మాంసం కూరలు చెయ్యవా?" అనడిగిందామె.

"నేను నీచు తిననని నీకు చెప్పాను. నీకు కావాలంటే చేసిపెట్టననలేదు నేను" అంది సువర్ణ మొహం ముడుస్తూ.

"చూశారా చోద్యం. ఆవిడ తినకుండా నేనెలా తింటాను? మాది ఆదర్శ వర్ణాంతర వివాహం. భార్యతినన్ది భర్త తినటం సరైన పనికాదు."

"ఎవరి తిండి వాళ్ళు తింటారు. తినే తిండికి ఆదర్శం అంటగట్టద్దు" అంది సువర్ణ.

"నువ్వెందుకు నీచు తినవమ్మా. మీ పేరెంట్స్ తినరా?" అనడిగాడు క్రిస్టోఫర్.

"వాళ్ళు తింటారు. నాకే ఇష్టముండదు. నేను తినను" అంది సువర్ణ.

"సమాజంలో పైకి ఎదగాలనే ప్రయత్నంలో భాగంగా మనకు తెలియకుండానే పైవర్ణాల అలవాట్లను మనవి చేసుకునే ప్రయత్నం చేస్తాం. అందులోని ఓ అంశమే నీచు తినకుండా మానేయటం" అన్నారు క్రిస్టోఫర్.

"అవును, బ్రాహ్మణినై పోదామనుకుంటోంది మా ఆవిడ" అన్నాడు రంగస్వామి.

"నాయుడిగారి దొరసాని దాకా కూడా ఎదగనిచ్చేట్టు లేవు నువ్వు. ఇంకా ఆ పైకి ఎదగనిస్తావా?" అంది సువర్ణ నీరసంగా.

"నువ్వు అంతకు పైకి ఎదగాలన్నా వాళ్ళు నిన్ను కలుపుకోరులే. అందరూ నాలా ఉండరు" అన్నాడు రంగస్వామి నాయుడు.

"ఆ మాట మాత్రం నిజం" అంది సువర్ణ.

క్రితం రాత్రి భర్తతో జరిగిన వాగ్వాదం ఆమె ఇంకా మరచిపోలేదు. ఆమె ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తల్లికీ తండ్రికీ వాళ్ళ పుట్టిన రోజున బట్టలు కొనేది. ఆ అలవాటు చొప్పున తండ్రి పుట్టినరోజు దగ్గరపడుతుండడంతో, జీతం రాగానే షాపుకి వెళ్ళి తండ్రికీ, తల్లికీ బట్టలు తీసుకుంది ఆమె. సుమారుగా పదిహేను వందల రూపాయల దాకా ఖర్చయింది. సాయంత్రం ఇంటికి రాగానే రంగస్వామి భార్యను "జీతం వచ్చిందా?" అని అడిగాడు.

"వచ్చింద"ని చెప్పి ఆమె అతని చేతిలో రెండువేల ఐదొందలు పెట్టింది.

"ఇంతేనా? నీ జీతం నాలుగువేలని చెప్పావు?" అడిగాడతను.

"అవును. రేపు ఏడో తారీకు మా నాన్న పుట్టినరోజు. మా అమ్మకీ, నాన్నకీ బట్టలు కొన్నాను" అంది ఆమె.

"అందుకు పదిహేను వందలయిందా? చూసి ఖర్చుపెట్టుకోవాలి. మనమేం ధన వంతులం కాదు. అయినా మీ నాన్న పుట్టిన రోజయితే, మీ అమ్మకు కూడా బట్టలు కొనటమెందుకూ?"

"నేనట్లా వాళ్ళను విడివిడిగా చూడను. ఎవరి పుట్టిన రోజొచ్చినా ఇద్దరికీ బట్టలు పెడతాను."

"చూడను అంటే కుదర్దు. చూడడం నేర్చుకోవాలి. ఓ వర్గం అణగారిపోయిన జీవితం గడిపిందంటే అందుకు ఒక కారణం మనీ మానేజిమెంటు తెలియకపోవటమే."

"నేను మా వాళ్ళకు బట్టలు కొన్నందుకు నువ్వు విషయాలు సాధారణీకరణం చెయ్యక్కర్లా" అంది సువర్ణ కోపంగా.

"చరిత్ర చెప్తున్న సత్యం అది. అందుకు నీకు కోపం ఎందుకు?"

"చరిత్రేం చెప్తోందో నీకు సరిగ్గా తెలిస్తే ఆ మాటనవు."

"నాకు - మాకు తెలియదా, నిన్న మొన్న కన్ను తెరిచిన మీకు - నీకు తెలిసినంత?"

"నాకు - మాకు మనుషుల ఆత్మీయతలు తెలుసు. మనసులు తెలుసు. మీలా - నీలా అన్నింటిని డబ్బుతో కొలవటం తెలియదు."

ఆ మాటలతో కోపం వచ్చింది రంగస్వామికి. "అందుకే మిమ్మల్ని అస్పృశ్యులని ఊర్కే అనలా."

"నువ్వు నీ కులాన్నీ, నా కులాన్నీ ఎప్పుడూ మర్చిపోవు. మనం పెళ్ళి చేసుకుని పొరపాటు చేశాం."

"నీ సామాజిక స్థాయి పెంచాను. అది నీకు చేదయిపోయిందా?"

"అది నువ్వు కలిగించిందేమీ కాదు. గాంధీ, అంబేద్కర్ లాంటి మహానుభావులు కలిగించారు. భారత రాజ్యాంగం కలిగించింది. నిన్ను చేసుకోకపోయినా నా సామాజిక స్థాయి పెరక్కపోలేదు. పైవాళ్ళంటే నీకు ద్వేషం. కింద వాళ్ళంటే చిన్నచూపు. కులతత్వం నీలో పోలేదు."

"నాకు కులతత్వం అంటగట్టిన నీకు జన్మలో నిష్కృతి లేదు."

"నువ్వు ఇవ్వగలిగే నిష్కృతి నాకక్కర్లేదు."

ఓసారి -

"ఇవాళ మా వాళ్ళింటికి వెళ్ళాను" అన్నాడు రంగస్వామి.

"చెపితే నేనూ వచ్చేదాన్నిగా" అంది సువర్ణ.

"వాళ్ళ కోపాలేమయినా తగ్గాయో లేదో తెలుసుకుందామని వెళ్ళాను. పరిస్థితి తెలుసుకోకుండా నిన్ను వెంటపెట్టుకుని వెళితే రాద్ధాంతం చెయ్యరూ? అందుకే, ఒక్కణ్ణే వెళ్ళాను. మా అమ్మ నన్ను చూసి ఏడ్చింది. 'ఏమైందని అలా ఏడుస్తున్నావు?' అనడిగాను.

అందుకు జవాబివ్వకుండా, 'నువ్వేం చూసి ఆ పిల్లని పెళ్ళి చేసుకున్నావురా, రంగా' అనడిగింది అమ్మ. 'సువర్ణ చక్కగా ఉంటుంది. ఎంత చక్కగా నవ్వుతుందనుకున్నావ్! నువ్వామెను సరిగ్గా గమనించలేదు' అన్నాను. 'చక్కనిదేనేమో, చక్కదనం కోసుకు తింటామా? కులం గోత్రం చూసుకోనక్కర్లా?' అంది. 'కులాల పట్టింపులు నాకు లేవు. అందుకే మా పరిచయమైన చాలా కాలం దాకా ఆమె కులమేదో నేను తెలుసుకోలేదు అన్నాను..."

"తెలుసుకునేటప్పటికి చాలా ఆలస్యమైంది కదూ?" అంది సువర్ణ అతన్ని పూర్తి చేయనివ్వకుండా.

"పోనీలే అలాగే అనుకో. అంతలో మా నాన్న వచ్చాడు బయటనుంచి. నన్ను చూసి కోపంగా, 'ఎందుకొచ్చావురా?' అన్నాడు. 'మిమ్మల్ని చూసి వెళ్దామని వచ్చాను' అన్నాను. 'అంత అభిమానం కూడానా? ఆస్తిలో వాటా ఇస్తే పట్టుకుపోదామని వచ్చి ఉంటావు?' అన్నాడు. 'అవును. అందుకే వచ్చాను' అన్నాను. 'పో వెధవా! పో. నా ఆస్తిలో నీకు దమ్మిడీ కూడా రాదు. ఇదంతా నా స్వార్జితం' అన్నాడు. 'చూస్తా. నాకు న్యాయంగా రావల్సిన ఆస్తి ఎలా రాకుండా చేస్తారో' అని లేచి వచ్చేశాను. మా ముసలాడికి వళ్ళు పొగరు. ఆస్తి అహంకారం, కులపు అహంకారం. ఆ ముసలాడి తలబద్దలుకొట్టయినా నా వాటా నేను సంపాదించుకుంటాను" అన్నాడు రంగస్వామి, ఆ సంఘటనను మళ్ళీ ఊహించుకుంటూ తిరిగి ఆవేశం తెచ్చుకుంటూ.

"వాళ్ళు నీకు ఆస్తి ఇవ్వలేదని ఎందుకనుకోవాలి! కులం, చదువు, హోదా, డబ్బు, అందం, సమాజంలో గౌరవం అన్నీ ఆస్తులే కదా! పైకులంలో పుట్టటంవల్ల తనందరికన్నా పైనున్నాడన్న భావన, కింది కులాలపై చులకన భావన, ఆ కులంలో పుట్టటంవల్ల సమాజం ఇచ్చే గౌరవం – ఇవి వాళ్ళిచ్చిందే కదా! అందం – అదిమాత్రం మనం సంపాదించు కున్నామా? మనకు తల్లిదండ్రుల నుంచి వచ్చిందే. చదువు – సమాజం కల్పించే అవకా శాలవల్లే చదువు అబ్బుతుంది. చదువు నేర్చుకునే తెలివితేటలు మనకు ఉండాలనుకో. అయితే, అవకాశాలు మనం సంపాదించినవి కాదు కదా! చదువును బట్టి, ఉద్యోగం, హోదా వస్తాయి. హోదానుబట్టి డబ్బు వస్తుంది. వీటన్నింటిని బట్టి సమాజంలో గౌరవం లభిస్తుంది. వీటిల్లో నీ సొంతమేది?" అంది సువర్ణ అతన్ని అనునయించటానికన్నట్లు.

"ఈ తిక్కవాదనలే వద్దు. ఆస్తి అంటే ఏమిటి? క్రయ విక్రయాలకు అనువైనది ఆస్తి. నువ్వు చెప్పిన మిగతావన్నీ ఆస్తి కిందకు రావు."

"పోన్లే నాది తిక్కవాదనే అనుకో. పెంచి పెద్ద చేసిన వాళ్ళమాట నువ్వు వినలేదు. కొడుకు తమ స్వంతం అనుకుంటున్న తల్లిదండ్రులకు అందుకు కోపం రాదా! ఆ కోపాన్ని ఇలా వెళ్ళగక్కారు ఆయన. అయినా, ఒకళ్ళు ఇచ్చే ఆస్తి మనకెందుకూ? మనం సంపాదించుకోలేమా?"

"నీకు తెలిసి చావదు. నువ్వు నోర్మూసుకో" అని లేచి విసురుగా బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు రంగస్వామి.

రంగస్వామిది తనకు నచ్చిందల్లా చేజిక్కించుకునే తత్త్వం. తండ్రి ఆస్తి ఇవ్వనన్నాడని ఆయనపై కినుక వహించాడు. వాళ్ళ ఇంటివైపు వెళ్ళటం మానుకున్నాడు. తను తప్ప ఎవరూ కన్పించరతనికి. అందుకే ఓసారి సువర్ణతో అన్నాడు – "మనకు పిల్లలొద్దు" అని.

అతని మాటలు విని సువర్ణ ఆశ్చర్యపోయింది. "ప్రస్తుతానికయితే ఫర్లేదు. కావల్సినప్పుడే కనొచ్చు" అంది. సంతానకాంక్ష స్త్రీలకు సహజం.

"ప్రస్తుతానికని కాదు. ఎప్పటికీ మనకు పిల్లలు వద్దు" అన్నాడతను.

"ఎందుకనీ?"

"వాళ్ళని ఏ కులపు పిల్లలని చెప్తాం? నీ కులమా? నా కులమా?"

"మనుషులని చెప్తాం."

"వాళ్ళకు పెళ్ళిళ్ళవటం కష్టం."

"వాళ్ళకిష్టమొచ్చిన వాళ్ళను చేసుకుంటారు."

"అవున్లే. నేను నిన్ను చేసుకోలా? అలా ఎవరో దొరకొచ్చు."

"పెళ్ళి చేసుకుని నన్ను ఉద్ధరించానని నువ్వేం భావించక్కర్లా."

"కులం నువ్వనగానే చెరిగిపోయేదా? శ్రామిక, ధనిక వర్గాలని మార్క్స్ సిద్ధాంతీకరించాడు. అయితే, మన దేశంలో ఇంకా సూక్ష్మవర్గాలున్నాయి – కులాలు, మతాలు. ఈ దేశంలో ఏ మనిషీ మరో మనిషికి సమానం కాదు. అతను ముందుగా ఆ కులస్థుడు, మతస్థుడు. ఆ తర్వాతే అతను మనిషి. అందుకే శ్రామికవర్గాలలో కూడా వర్ణాంతర వివాహాలు సర్వసామాన్యం కాలేకపోయాయి. కమ్యూనిస్టులూ, కులనిర్మూలనా తత్త్వవేత్తలూ మనిషిని జడ పదార్థంగా భావించి సిద్ధాంతీకరించ ప్రయత్నించారు. అందుకే ఈ సిద్ధాంతాలు ఫెయిలయ్యాయి."

"మానవ పరిణామక్రమ చరిత్రలో మనం గతించిందెంత? ఇవాళ నువ్వు ఫెయిలయ్యాయన్న సిద్ధాంతాలే రేపు నిజం కావచ్చేమో! ఆర్థిక ప్రాతిపదికకు ఎప్పుడూ ప్రాధాన్యం ఉంది. ముందు కాలంలో దాని ప్రాధాన్యం మరింత పెరిగిపోతుంది. అప్పుడు నువ్వనే కులాలు, మతాలని అధిగమించే సర్వసామాన్య స్థితి రావచ్చు."

"మనకున్నదే కొద్ది బుర్ర. ఇంతగా ఆలోచించి ఉన్నది కాస్తా ఖర్చు చేసుకోకు."

"నా ఆలోచనలు కూడా నువ్వే చేస్తానంటే నేనెందుకా ప్రయత్నం చేస్తాను?"

"అంటే నేను నిన్ను సుఖపెట్టటం లేదా?"

"బోల్డంత. మనకు పిల్లలుండటం కూడా నన్ను సుఖపెట్టటంలో భాగమే."

"మనకు పిల్లలొద్దని చెప్పాను. కాంట్రాసెప్టివ్ పిల్స్ వాడుతున్నావా?"

"ప్రస్తుతానికి వాడుతున్నాను. నాకు పిల్లలు కావాలనిపించినప్పుడు మానేస్తాను."

"నన్ను కాదని నువ్వేం చేయలేవు. నేను ఆపరేషను చేయించుకుంటాను."

"నీకెందుకింత పట్టుదల? వాళ్ళని కని, పెంచే భారం నాది. ఆ బాధ్యతంతా నేను తీసుకుంటాను. నీకు అణుమాత్రమంత కష్టం కూడా కలగనివ్వను" అంది సువర్ణ అర్థింపుగా.

"నువ్వు నాకేం చెప్పక్కర్లా. నా మాట కాదని నువ్వు గర్భం ధరించావో - గుర్తుంచుకో. మనం కలిసి ఉండం, విడిపోతాం. విడాకులు పుచ్చుకుంటాం" అన్నాడు రంగస్వామి కోపంగా లేచి వెళ్ళిపోతూ.

"ఇప్పుడు మనం కలసి ఉన్నామా?" అంది సువర్ణ వెళ్ళిపోతున్న భర్తవంక చూస్తూ.

అదెప్పుడో జరుగుతుందని ఆమె అనుమానిస్తూనే ఉంది. విడిపోవటమే కనుక సంభవిస్తే తమని వేరుచేసేది కులతత్వమా? మనిషి చిత్తవృత్తా? - ఏది కారణమో తేల్చుకోలేకపోయింది సువర్ణ.

'ఆంధ్రభూమి' సచిత్ర వారపత్రిక, 9 నవంబర్ 2000